www.prajasakti.com

ప్రజాశక్తి

శుక్రవారం 2 ఫిబ్రవరి 2024



ఐదుగురు బిఎల్ఒలపై వేటు

సస్పెండ్ చేస్తూ కలెక్టర్ ఉత్తర్వుల జారీ

భీమవరం: ఓటర్ల జాబితాలో తప్పొప్పుల సవరణలో భాగంగా విధుల పట్ల నిర్లక్ష్య ధోరణి ప్రదర్శించిన ఐదుగురు బిఎల్ఒలను సస్పెండ్ చేస్తూ జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి ఉత్తర్వులు జారీ చేశారు. ఆ ఐదుగురిపై పూర్తిస్థాయి విచారణకు ఆదేశించారు. భీమవరం నియోజకవర్గం పిఎస్ నెంబర్-72 వెల్ఫేర్ సెక్రటరీ జె.చంటి, పిఎస్ నెంబర్-165 వెల్ఫేర్ అండ్ ఎడ్యుకేషనల్ సెక్రటరీ కె.నాగవెంకటతేజ, పాలకొల్లు నియోజకవర్గం పిఎస్ నెంబర్-154 తిల్లపూడి విఆర్ఒ ఎవిఎస్.సుబ్రమణ్యం, నర్సాపురం నియోజకవర్గం పిఎస్ నెంబర్-30 ఎడ్యుకేషన్ అండ్ డేటా ప్రాసెసింగ్ అసిస్టెంట్ బి.అనిత, ఉండి నియోజకవర్గం పిఎస్ నెంబర్-23 వెల్ఫేర్ అసిస్టెంట్ కెవివి.సత్యనారాయణలను సస్పెండ్ చేశారు. ఇదే అంశంపై గత నెల 29న ఇద్దరు బిఎల్ఒలను సస్పెండ్ చేసిన సంగతి తెలిసిందే. దీంతో జిల్లాలో ఇప్పటి వరకూ ఏడుగురు బిఎల్ఒలపై సస్పెన్షన్ వేటు పడింది.

సాగుకు సాయం.. నై నై..!



మోడీ సర్కార్ ప్రవేశపెట్టిన మధ్యంతర బడ్జెట్‌లో వ్యవసాయానికి మొండిచెయ్యి చూపించింది. గురువారం కేంద్ర ఆర్థిక మంత్రి సీతారామన్ మధ్యంతర బడ్జెట్‌ను పార్లమెంట్‌లో ప్రవేశపెట్టారు. ఎన్నికల వేళ ప్రవేశపెడుతున్న ఈ బడ్జెట్‌లో రైతులకు వరాలు కురిపించనున్నట్లు పెద్దఎత్తున ప్రచారం సాగింది. కేంద్రం పిఎం కిసాన్ సమ్మాన్ నిధి కింద రైతులకు ఏడాదికి రూ.ఆరు వేలు ఇస్తోంది. ఈ సొమ్మును రూ.తొమ్మిది వేలకు పెంచనున్నట్లు ప్రచారం నడిచింది. దీంతో ఎంతోకొంత రైతులకు మేలు జరుగుతుందని అంతా ఆశించారు. బడ్జెట్‌లో దానికి సంబంధించిన ఊసేలేకుండా పోయింది.

- కేంద్ర బడ్జెట్‌లో రైతుకు మోడీ సర్కార్ దగా
- పిఎం కిసాన్ సమ్మాన్‌నిధి పెంపు తూచ్
- మద్దతు ధరల గ్యారెంటీ చట్టం ఊసే కరువు
- పోలవరానికి నిధులు సున్నా
- రైల్వే ప్రాజెక్టులు, నిట్‌కు నిధులపైనా అంతే
- ఆదాయ పన్ను పరిమితిపై వేతన జీవులకు నిరాశ

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

జిల్లాలో 80 శాతం ప్రజలు వ్యవసాయ రంగంపైనే ఆధారపడి జీవిస్తున్నారు. పిఎం కిసాన్ సమ్మాన్ నిధి పెంచితే జిల్లా రైతాంగానికి కొంత మేలు జరిగే అవకాశం ఉంటుందని అంతా భావించినా నిరాశే మిగిలింది. ఈసారి బడ్జెట్‌లో కౌలురైతులకు వర్తించేలా ఈ నిధిలో మార్పులు జరుగుతాయని భావించారు. మోడీ సర్కార్ ఆ ఊసే లేకుండా చేసింది. మద్దతు ధరల గ్యారెంటీ చట్టం చేయాలంటూ రైతులు మోడీసర్కార్‌పై ఎప్పటి నుంచో పోరాడుతున్నారు. ఈ చట్టం చేస్తే రైతులకు మేలు జరిగే అవకాశం ఉన్నా మోడీ సర్కార్ ఈ బడ్జెట్ ఆ దిశగా ప్రయత్నమే చేయలేదు. జిల్లాలో వరిసాగు పెద్దఎత్తున ఉంది. ప్రస్తుతం వరికి క్వింటాల్‌కు రూ,2,183 మాత్రమే ధర ఉంది. మద్దతు ధర గ్యారెంటీ చట్టం తెస్తే వరికి క్వింటాల్‌కు రూ.2,800కుపైగా ధర లభిస్తుంది. ఇది జిల్లా రైతాంగానికి ఎంతోమేలు. జిల్లాలో అత్యధికంగా సాగయ్యే పామాయిల్, ఆక్వాకు సైతం మేలు చేసేలా ఈ బడ్జెట్‌లో ఏఒక్కటీ లేకపోవడంతో రైతుల్లో తీవ్ర నిరాశ నెలకొంది. భారీగా పెరిగిన ఎరువుల ధరలపైనా కేంద్రప్రభుత్వం రైతులకు ఊరటనిచ్చే ప్రయత్నం చేయలేదు.

పోలవరానికి నిధులు సున్నా..

పోలవరం ప్రాజెక్టుకు సంబంధించి నిధుల కేటాయింపులో కేంద్ర ప్రభుత్వం తన చివరి బడ్జెట్‌లోనూ మొండిచెయ్యి చూపింది. దీంతో పోలవరం నిర్వాసితులకు ఇప్పట్లో పరిహారం అందే పరిస్థితి లేకుండాపోయింది. నిర్వాసితులకు పునరావాసం, పరిహారానికి రూ.30 వేల కోట్లకుపైగా ఖర్చవుతుందని రాష్ట్ర ప్రభుత్వం తేల్చింది. పోలవరానికి పూర్తిస్థాయి నిధులను కేంద్రమే ఇవ్వాల్సి ఉంది. మధ్యంతర బడ్జెట్‌లోనూ పోలవరం ఊసే లేకుండా కేంద్రం వ్యవహరించింది. ఇది నిర్వాసితుల కుటుంబాలపై తీవ్ర ప్రభావం చూపనుంది.

రైల్వే ప్రాజెక్టులు, నిట్‌కు నిధులూ అంతే..

జిల్లాలో కొవ్వూరు-భద్రాచలం, నరసాపురం-కోటిపల్లి రైల్వేలైన్లకు సంబంధించిన నిధుల కేటాయింపుల్లోనూ జిల్లా ప్రజానీకానికి నిరాశే మిగిలింది. బడ్జెట్‌లో జిల్లాకు సంబంధించిన రైల్వేలైన్ల ఊసే లేకుండాపోయింది. కేంద్ర విద్యాసంస్థ నిట్‌కు కేటాయింపులపై బడ్జెట్‌లో స్పష్టత లేదు. దీంతో 2024 మధ్యంతర బడ్జెట్‌లో జిల్లాకు సంబంధించి ఎటువంటి మేలూ లేకుండా పోయింది.

వేతన జీవులకు నిరాశే..

ఆదాయపు పన్ను పరిమితిని రూ.2.50 లక్షల నుంచి రూ.ఐదు లక్షలకు పెంచే అవకాశం ఉందని వేతన జీవులు భావించారు. అయితే బడ్జెట్ ప్రసంగంలో ఆదాయపు పన్ను పరిమితికి సంబంధించి మార్పులు ఏవీ ఉండబోవని, యథాతథంగా ఉంటాయని ఆర్థికమంత్రి స్పష్టం చేశారు. దీంతో వేతన జీవులకు మరోసారి నిరాశే మిగిలింది.



పోలింగ్ స్టేషన్లను పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ ప్రశాంతి

పోలింగ్ కేంద్రాల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలి

జిల్లా కలెక్టర్ ప్రశాంతి

ప్రజాశక్తి - భీమవరం

పోలింగ్ కేంద్రాల్లో నూరుశాతం మౌలిక సదుపాయాలు కల్పించేందుకు చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి అధికారులను ఆదేశించారు. గురువారం చినఅమిరం, రాయలం, 19, 25, 32 వార్డుల్లో పోలింగ్ కేంద్రాలను కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పోలింగ్‌బూత్ లోపలికి, బయటికి రాకపోకలకు వీలుగా వేర్వేరు మార్గాలను ఏర్పాటు చేయాలన్నారు. మహిళలు, పురుషులకు వేర్వేరుగా మరుగుదొడ్లు ఏర్పాటు చేయాలన్నారు. లోఓల్టేజీ సమస్య ఉంటే ముందుగానే గుర్తించి చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డిఒ కె.శ్రీనివాసులురాజు, డిపిఒ జివికె.మల్లికార్జునరావు, ఆర్అండ్‌బి అధికారి బి.లోకేశ్వరరావు, తహశీల్దారు వై.రవికుమార్, మున్సిపల్ కమిషనర్ ఎం.శ్యామల, మున్సిపల్ ఇంజినీరు పి.త్రినాథరావు, సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న యుటిఎఫ్ రాష్ట్ర కోశాధికారి గోపీమూర్తి

బకాయిల విడుదల పోరు ఉధృతం

యుటిఎఫ్ రాష్ట్ర కోశాధికారి గోపీమూర్తి

రెండోరోజు కొనసాగిన రిలే నిరాహార దీక్షలు

ప్రజాశక్తి - భీమవరం

ప్రభుత్వం ఆర్థిక బకాయిలను విడుదల చేయాలని చేస్తున్న పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తున్నట్లు యుటిఎఫ్ రాష్ట్ర కోశాధికారి బి.గోపీమూర్తి తెలిపారు. స్థానిక యుటిఎఫ్ జిల్లా కార్యాలయం ఎదురుగా ఆర్థిక బకాయిల విడుదల కోరుతూ చేపట్టిన రిలే నిరాహార దీక్షలను గురువారం రెండోరోజు గోపీమూర్తి ప్రారంభించి మాట్లాడారు. అన్నిరకాల ఆర్థిక బకాయిలు చెల్లించే వరకు ఈ పోరాటం పెద్దఎత్తున సాగుతుందన్నారు. రాష్ట్ర కమిటీ ఓట్ ఫర్ ఓపిఎస్ పేరుతో కార్యాచరణ ప్రకటించిందన్నారు. దీనిలో భాగంగా ఈ నెల ఏడో తేదీ వరకు అన్ని కార్యాలయాలు, స్కూళ్లలో ఓట్ ఫర్ ఓపిఎస్ పోస్టర్లు ఆవిష్కరిస్తామన్నారు. ఐదో తేదీ నుండి అన్ని రాజకీయ పార్టీలకు పోస్టుకార్డు క్యాంపెయిన్ చేస్తామన్నారు. 12 నుండి 15 వరకూ అన్ని రాజకీయ పార్టీల మండలస్థాయి నేతలకు, 18 నుండి 20 వరకు అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల ఇన్‌ఛార్జీలకు సమస్యను విన్నవిస్తామన్నారు. 23న జిపిఎస్‌పై బుక్‌లెట్ విడుదల, 25 నుండి 28 వరకు అన్ని పార్టీల జిల్లా నాయకత్వానికి ప్రాతినిధ్యం చేస్తామన్నారు. మార్చి 15 నుండి 30 వరకు అసెంబ్లీ అభ్యర్థుల బహిరంగ చర్చావేదికల్లో మాట్లాడించడం, మార్చి 26 నుండి 30 వరకు అన్ని నియోజకవర్గ కేంద్రాల్లో బైక్ ర్యాలీలు చేపడతామని తెలిపారు. అన్ని రాజకీయ పార్టీల మేనిఫెస్టోలో ఓపిఎస్ పునరుద్ధరించేలా హామీని తీసుకుంటూ ఈ కార్యక్రమం సాగిస్తామన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి ఎకెవి.రామభద్రం మాట్లాడుతూ తామేమీ గొంతెమ్మ కోర్కెలు కోరడం లేదని, మాకు రావాల్సినవే అడుగుతున్నామన్నారు. దీక్షలో జిల్లా నేతలు ఎం.మార్కండేయులు, కె.శ్రీదేవి, సిహెచ్.పట్టాభిరామయ్య, ఎస్.రత్నంరాజు, పి.శివప్రసాద్, టిజె.జయకుమార్, సాయిరాం, రామకృష్ణ ప్రసాద్, ఏసుబాబు, జివి.రామానుజరావు, ఎంవి.రాజశేఖర్, నాయకులు పాల్గొన్నారు.

విశాల పోరాటాలతోనే సమస్యలు పరిష్కారం

సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి రాజారామ్మోహన్‌రాయ్

ప్రజాశక్తి - భీమవరం

విశాల పోరాటాల ద్వారానే సమస్యలు పరిష్కారమవుతాయని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కె.రాజారామ్మోహన్‌రాయ్ అన్నారు. గురువారం స్థానిక సిఐటియు కార్యాలయంలో జిల్లా అధ్యక్షులు జెఎన్‌వి.గోపాలన్ అధ్యక్షతన సిఐటియు జిల్లా ఆఫీస్ బేరర్స్ సమావేశం జరిగింది. రాయ్ మాట్లాడుతూ వినతులిస్తే సమస్యలు పరిష్కరించే పరిస్థితి నుంచి రోజులు తరబడి సమ్మె చేస్తేనే పరిష్కరించాలనుకోవడం పాలకులకు సిగ్గుచేటన్నారు. బలమైన ఉద్యమాల ద్వారానే సమస్యలు పరిష్కారమవుతాయని అంగన్వాడీల సమ్మె రుజువు చేసిందన్నారు. పాలకులు తమ పదవులు, అధికారం ఆధారంగానే అభివృద్ధిని చూడటం బాధాకరమని తెలిపారు. ప్రజలు తమ సమస్యల పరిష్కారానికి సుదీర్ఘకాలం పోరాటం చేయాల్సి రావడం దారుణమన్నారు. కార్మిక సంఘాలు కూడా పోరాటాలు విస్తృతం చేయడానికి అనేక రూపాల్లో ప్రయత్నాలు ప్రారంభించాయన్నారు. పోరాటాలను అణచాలనుకోవడం అవివేకమని అంగన్వాడీ పోరాటం రుజువు చేసిందన్నారు. సెర్ప్ ఉద్యోగులు, విఒఎలు, ఆశాలు, విఆర్ఎలు ఆందోళనకు సిద్ధమవుతున్నారన్నారు. తక్షణమే ప్రభుత్వం వారి సమస్యలు కూడా పరిష్కరించాలని సమావేశం డిమాండ్ చేసింది. ఈ సమావేశంలో నేతలు కర్రి నాగేశ్వరరావు, తెలగంశెట్టి సత్యనారాయణ, ఎం.త్రిమూర్తులు, జవ్వాది శ్రీనివాసు, డి.కళ్యాణి, డి.జ్యోతి, ఎం.ఆంజనేయులు, ఎస్.రంగారావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి రాయ్



పాలకొల్లులో నిరసన తెలుపున్న మహిళా న్యాయవాదులు

కొనసాగిన న్యాయవాదుల దీక్షలు

ప్రజాశక్తి - పాలకొల్లు

ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌కు వ్యతిరేకంగా స్థానిక కోర్టు వద్ద గురువారం నాలుగో రోజు దీక్షలు కొనసాగాయి. నిరసన దీక్షలో మహిళా న్యాయవాదులు పి.శోభనాలక్ష్మి, సుజాత, నగేష్, నాగమణి, పల్లవి, సత్యశ్రీ, దుర్గావతి, గాయత్రి సునీల్, లక్ష్మి, జ్యోతి, ఆశా జ్యోతి పాల్గొన్నారు.

నేడు నరసాపురం బంద్

నరసాపురం: భూహక్కు చట్టాన్ని రద్దు చేయాలని కోరుతూ నరసాపురం బార్ అసోసియేషన్ ఈ నెల రెండో తేదీ శుక్రవారం నరసాపురం బంద్‌కు పిలుపునిచ్చింది. ఈ బంద్‌కు పట్టణ ప్రజలు, అన్ని రాజకీయ పార్టీలు, వర్తక వాణిజ్య సంఘాలు, విద్యాసంస్థలు సహకరించాలని బార్ అసోసియేషన్ అధ్యక్షులు చల్లా దానయ్యానాయుడు ఒక ప్రకటనలో కోరారు.

నేటి నుంచి రైతుపోరుబాట పాదయాత్ర

ఎంఎల్‌ఎ నిమ్మల రామానాయుడు

ప్రజాశక్తి - పాలకొల్లు

రాష్ట్ర ప్రభుత్వ రైతు వ్యతిరేక చర్యలను నిరసిస్తూ ఈ నెల రెండో తేదీ నుంచి మూడు రోజులపాటు పాలకొల్లు నియోజకవర్గంలో రైతు పోరుబాట పాదయాత్ర నిర్వహిస్తున్నట్లు ఎంఎల్‌ఎ నిమ్మల రామానాయుడు చెప్పారు. టిడిపి కార్యాలయంలో ఆయన గురువారం మీడియాతో మాట్లాడారు. పాలకొల్లు మండలం శివదేవుని చిక్కాలలో ఈ నెల రెండో తేదీన యాత్ర ప్రారంభిస్తామని, నాలుగో తేదీ వరకూ మూడు రోజులపాటు పాలకొల్లు, పోడూరు, యలమంచిలి మండలాల్లో యాత్ర నిర్వహిస్తామని చెప్పారు. ఈ నెల 5 నుంచి ప్రారంభమయ్యే అసెంబ్లీ సమావేశాల్లో కూడా రైతులకు జరుగుతున్న అన్యాయంపై ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తామని స్పష్టం చేశారు. వైసిపి ప్రభుత్వం వచ్చాక గత 58 నెలల్లో రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ, ఇన్సూరెన్స్, యాంత్రీకరణ మరిచారన్నారు. ఆరు నెలలు కష్టపడి పండించిన ధాన్యాన్ని అమ్ముకునే పరిస్థితి లేదని చెప్పారు. కౌలురైతుల పరిస్థితి అగమ్యగోచరంగా ఉందన్నారు. టిడిపి పాలకొల్లు మండల అధ్యక్షుడు కోడి విజయభాస్కర్ మాట్లాడుతూ జగన్ ప్రభుత్వంలో మద్యానికి గిట్టుబాటు ధర ఉందని, రైతు పండించిన పంటకు లేదని చెప్పారు. సమావేశంలో జనసేన నేతలు శిద్దిరెడ్డి అప్పారావు, శిడగం సురేంద్ర, పితాని వెంకటేష్, టిడిపి నేతలు పెచ్చెట్టి బాబు, జివి, మామిడిశెట్టి పెద్దిరాజు పాల్గొన్నారు.




వివరాలు వెల్లడిస్తున్న జిల్లా ఎస్‌పి రవి ప్రకాష్

భీమవరంలో భారీగా బంగారం స్వాధీనం

- ఆరు కేజీల బంగారం
- రూ.49,970 నగదు స్వాధీనం
- 10 మంది అరెస్ట్ : జిల్లా ఎస్‌పి రవిప్రకాష్

ప్రజాశక్తి - భీమవరం

పశ్చిమగోదావరి జిల్లా కేంద్రమైన భీమవరంలో అక్రమంగా పెద్దఎత్తున తరలిస్తున్న బంగారాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. రూ.3.84 కోట్ల విలువైన ఆరు కిలోల బంగారాన్ని స్వాధీనం చేసుకున్నారు. అలాగే రూ.49,970 నగదు స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనలో పది మందిని అరెస్టు చేసినట్లు జిల్లా ఎస్‌పి యు.రవిప్రకాష్ తెలిపారు. స్థానిక టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జిల్లా ఎస్‌పి రవిప్రకాష్ మాట్లాడారు. టౌన్ రైల్వేస్టేషన్ సమీపంలో అనుమానాస్పదంగా సంచరిస్తున్న పది మందిని అదుపులోకి తీసుకుని విచారించామన్నారు. వీరి నుంచి ఆరు కేజీల బంగారంతోపాటు రూ.49,970 నగదు స్వాధీనం చేసుకున్నామన్నారు. బంగారం విలువ సుమారు రూ.3.84 కోట్లు ఉంటుందని వివరించారు. గూడూరు నుంచి రాజమండ్రి బంగారాన్ని అక్రమంగా రవాణా చేస్తున్నట్లు గుర్తించామన్నారు. గూడూరులో శేషాద్రి ఎక్స్‌ప్రెస్ రైలు ఎక్కారని, రాజమండ్రి రైల్వేస్టేషన్‌లో చెకింగ్ ఎక్కువగా ఉంటుందని భావించిన దుండగులు భీమవరం టౌన్ రైల్వేస్టేషన్‌లో దిగారన్నారు. రోడ్డు మార్గాన రాజమండ్రి బయలుదేరుతుండగా తమ సిబ్బంది చాకచక్యంగా పట్టుకున్నారన్నారు. తూర్పుగోదావరి జిల్లా కోరుకొండకు చెందిన చిలక సాయికిరణ్, చిలక అరవింద్, బక్క వీరసాయి, రాజమహేంద్రవరానికి చెందిన కోళ్ల వెంకట కాంతారావు, వంక వెంకటేష్, గున వీర వెంకటరమణ, దాసరి గణేష్, గొడ్డు పైడిరాజు, ఆవిడి హేమంత్, వినయ్ (వాసు)లను అదుపులోకి తీసుకుని అరెస్టు చేసినట్లు తెలిపారు. సమావేశంలో డిఎస్‌పి శ్రీనాథ్, టూటౌన్ సిఐ జి.శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు.



మంత్రి కొట్టు సత్యనారాయణ

సిద్ధానికి సన్నద్ధం

డిప్యూటీ సిఎం కొట్టు సత్యనారాయణ

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం


సార్వత్రిక ఎన్నికలకు శంఖారావం పూరిస్తూ వైసిపి అధినేత, సిఎం జగన్మోహన్‌రెడ్డి ఈ నెల మూడో తేదీన ఏలూరులో చేపట్టిన సిద్ధం బహిరంగ సభకు నియోజకవర్గం నుంచి పెద్దఎత్తున పార్టీ శ్రేణులు హాజరు కానున్నట్లు డిప్యూటీ సిఎం కొట్టు సత్యనారాయణ తెలిపారు. గురువారం తన క్యాంపు కార్యాలయంలో పార్టీ నేతలతో ఆయన సమావేశం నిర్వహించారు. పార్టీ సీనియర్ నాయకులు ఘంటా ప్రసాదరావు హాజరయ్యారు. ఈ సందర్భంగా కొట్టు మాట్లాడుతూ ఈ నెల మూడో తేదీన ఏలూరులో ఉమ్మడి పశ్చిమగోదావరి, కృష్ణా జిల్లాలకు సంబంధించి సిద్ధం సభ జరుగుతోందన్నారు. సిఎం జగన్ ముఖ్యఅతిథిగా పాల్గొని సందేశం ఇస్తారన్నారు. ప్రతి గ్రామం, వార్డు నుంచి పెద్దఎత్తున పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, సానుభూతిపరులు తరలి రావాలని పిలుపునిచ్చారు. ఘంటా ప్రసాదరావు మాట్లాడగా ఎఎంసి ఛైర్మన్ ముప్పిడి సంపత్‌కుమార్, జెడ్‌పిటిసి ముత్యాల ఆంజనేయులు, నేతలు కొట్టు విశాల్, తెన్నేటి జగ్జీవన్, కర్రి భాస్కరరావు, కొలుకులూరి ధర్మరాజు, సంపత్‌రావు కృష్ణారావు, నేతలు పాల్గొన్నారు.

విద్యాభివృద్ధికి ప్రభుత్వం కృషి

డిసిసిబి ఛైర్మన్ పివిఎల్ నరసింహరాజు

ప్రజాశక్తి - పాలకోడేరు

విద్యాభివృద్ధికి ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని డిసిసిబి ఛైర్మన్ పివి.నరసింహారాజు అన్నారు. గరగపర్రు జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల విద్యార్థులకు ట్యాబ్‌లను ఎంపిపి భూపతి రాజు సత్యనారాయణ రాజు (చంటి రాజు)తో కలిసి పివిఎల్ నరసింహరాజు గురువారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పివిఎల్ మాట్లాడుతూ తాము చదువుకునే రోజుల్లో ఇన్ని రకాల సౌకర్యాలు లేవన్నారు. ఆ రోజులతో పోల్చుకుంటే మీరు చాలా అదృష్టవంతులన్నారు. నాడు-నేడు పథకంలో పాఠశాలలను సుందరంగా ఆధునికీకరించడం జరిగిందన్నారు. జగనన్న గోరుముద్ద, అమ్మఒడి, నుంచి, చదువుకునే పుస్తకాలు, బూట్లు, బట్టలు, ఇంగ్లీష్ మీడియం లో బోధన, డిజిటల్ ఎడ్యుకేషన్ ఇలా అనేక రకాల సౌకర్యాలు జగనన్న కల్పిస్తున్నారని తెలిపారు. బాగా చదువుకుని మంచి పేరు ప్రతిష్టలు తీసుకురావాలన్నారు. అనంతరం గ్రామంలో రూ.26 లక్షలతో నూతనంగా నిర్మించిన రైతు భరోసా కేంద్రాన్ని పివిఎల్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సర్పంచి ముదునూరి రామకృష్ణంరాజు, తల్లిదండ్రుల కమిటీ ఛైర్మన్ కర్తాక యాకోబు, ఉప సర్పంచి తోకల సునీత సాల్మన్ రాజు, సోమేశ్వర స్వామి దేవస్థానం ఛైర్మన్ చింతలపాటి బలరామరాజు పాల్గొన్నారు.



విదార్థులకు ట్యాబ్‌లు అందజేస్తున్న పివిఎల్

విద్యార్థులు కంపెనీలు ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

విద్యార్థులు సొంతంగా కంపెనీలను ఏర్పాటు చేసే స్థాయికి ఎదగాలని బిజినెస్ కన్సల్టింగ్ అండ్ ట్రెయినింగ్ ఫౌండర్ మేనేజింగ్ డైరెక్టర్ ఎస్.కృష్ణసౌజన్య సూచించారు. నిట్ ఇన్‌ఛార్జి డైరెక్టర్ ఎం.ప్రమోద్ పడోలే ఆధ్వర్యంలో రిజిస్ట్రార్ పి.దినేష్ శంకర్‌రెడ్డి పర్యవేక్షణలో ఇనిస్టిట్యూట్ ఇన్నోవేషన్ కౌన్సిల్ సౌజన్యంతో ఎంటర్ ప్రెన్యూర్ షిప్ స్కిల్స్ ఆటిట్యూడ్ అండ్ బిహేవియర్ డెవలప్మెంట్ అంశంపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని గురువారం ఆన్‌లైన్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా కృష్ణ సౌజన్య మాట్లాడుతూ దేశ ఆర్థికాభివృద్ధిలో టెక్నాలజీ కీలకపాత్ర పోషిస్తుందన్నారు. సమాజ అవసరాలకు అనుగుణంగా విద్యార్థులు విభిన్న, నాణ్యమైన ఆలోచనలు చేస్తూ నూతన ఆవిష్కరణలను చేపట్టాలన్నారు. డీన్ రీసెర్చ్ అండ్ కన్సల్టెన్సీ డాక్టర్ జిఆర్‌కె శాస్త్రి మాట్లాడుతూ నైపుణ్యాలకు సాంకేతికతను జోడిస్తే ఎన్నో అద్భుతాలను సృష్టించవచ్చన్నారు. కార్యక్రమంలో ఇనిస్టిట్యూట్ ఇన్నోవేషన్ కౌన్సిల్ అధ్యక్షురాలు డాక్టర్ వి.సుదర్శన దీప, ఉపాధ్యక్షులు డాక్టర్ పి.శంకర్, ఆచార్యులు డాక్టర్ వి.సందీప్, విద్యార్థులు పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెం రూరల్ ఎస్ఐగా సురేష్

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

తాడేపల్లిగూడెం రూరల్ ఎస్ఐగా పి.సురేష్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో రాజనగరం ఎస్ఐగా పనిచేస్తూ బదిలీపై వచ్చిన ఆయన తాడేపల్లిగూడెం రూరల్ ఎస్ఐగా బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఎస్ఐగా పనిచేసిన బి.రాజు భీమవరం రూరల్ ఎస్ఐగా బదిలీపై వెళ్లారు.


ఎంఎల్‌ఎ రామరాజుకు హారతినిస్తున్న మహిళలు

వైసిపి పాలనలో పంచాయతీ వ్యవస్థ అస్తవ్యస్తం

ఎంఎల్‌ఎ మంతెన రామరాజు

ప్రజాశక్తి - కాళ్ల

వైసిపి పాలనలో పంచాయతీ వ్యవస్థ పూర్తిగా అస్తవ్యస్తంగా మారిందని, రాష్ట్రంలో రాక్షస పాలన సాగుతోందని, ఇటువంటి నియంతృత్వ పాలనకు స్వస్తి పలకాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఎంఎల్‌ఎ మంతెన రామరాజు అన్నారు. కాళ్లలో ఇంటింటికీ టిడిపి 'భవిష్యత్తుకు గ్యారెంటీ' కార్యక్రమం గురువారం నిర్వహించారు. తొలుత ఇంటింటికీ వెళ్లి సమస్యలను తెలుసుకోవడంతోపాటు పెరిగిన విద్యుత్ ఛార్జీలు, గ్యాస్ ధరలు, ఇంటి, చెత్త పన్ను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎంఎల్‌ఎ మాట్లాడుతూ ఈ మండల కేంద్రంలో డ్రెయినేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉందని పలువురు మహిళలు తన దృష్టికి తీసుకొచ్చారన్నారు. చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి అయితే అన్ని వర్గాలకూ ప్రజలకూ న్యాయం జరుగుతుందన్నారు. రానున్న ఎన్నికల్లో టిడిపి - జనసేన ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వస్తేనే ప్రజల సమస్యలు తీరుతాయన్నారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షుడు జివి.నాగేశ్వరరావు, మాజీ అధ్యక్షులు బండారు వేణుగోపాలరావు, కోటి పాండురంగారావు, మాజీ ఎంపిపి ఆరేటి తాతాపండు, గ్రామాధ్యక్షుడు కొప్పినీడి గణపతి, ఉపసర్పంచి పన్నాస అబ్బులు, టిడిపి నాయకులు తోట ఫణిబాబు, పుప్పాల బుజ్జి పాల్గొన్నారు.

'ఓటు అడిగే హక్కు జగన్‌కే ఉంది'

ప్రజాశక్తి - ఆచంట

ప్రజలను ఓటువేయమని అడిగే హక్కు ఒక్క ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డికే ఉందని వైసిపి రాష్ట్ర కార్యదర్శి వైట్ల కిషోర్‌కుమార్ అన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో కార్యకర్తల సమావేశం గురువారం జరిగింది. ఈ సందర్భంగా కిషోర్ కుమార్ మాట్లాడుతూ ఈ నెల 3వ తేదీ శనివారం ఏలూరు జిల్లా దెందులూరులో జరగనున్న 'సిద్ధం' భారీ బహిరంగ సభకు అభిమానులు, నాయకులు, కార్యకర్తలు వేలాది మంది తరలివెళ్లాలని పిలుపునిచ్చారు. ఒక్క జగన్మోహన్ రెడ్డిని ఎదుర్కోవడానికి ప్రతిపక్ష నేతలందరూ ఏకమైనా ఏమిచేయలేక చివరకు వైఎస్‌ఆర్ కుటుంబాన్ని చీల్చి జగనన్నపైకి ఉసిగొల్పి నీచరాజకీయాలకు దిగజారుతున్నారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో వైసిపి జిల్లా కార్యదర్శి దేవిరెడ్డి రాంబాబు, గల్ సెల్ అధ్యక్షుడు వస్సు ఉమేష్, ఎండల కార్యదర్శి మనవర్తి విజయ్ కుమార్ పాల్గొన్నారు.

మహిళలకు అగ్రస్థానం కల్పించిన ఘనత జగన్‌దే

ప్రజాశక్తి - ఆచంట

దేశంలో ఎక్కడా లేని విధంగా రాష్ట్రంలో మహిళలకు ముఖ్య మంత్రి జగన్మోహన్ రెడ్డి అగ్రస్థానం కల్పించారని ఎంఎల్‌ఎ చెరుకువాడ శ్రీరంగనాథరాజు అన్నారు. తూర్పుపాలెం క్యాంపు కార్యాలయం వద్ద ఎంఎల్‌ఎ రంగనాథరాజు ఆధ్వర్యంలో గురువారం మూడోరోజు ఏర్పాటుచేసిన మనసారా జగనా కార్యక్రమానికి రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ ఛైర్మన్ నియోజకవర్గ పరిశీలకురాలు మేడపాటి షర్మిలారెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నామినేటెడ్ పదవుల్లోనూ మహిళలకు సగ భాగాన్ని చిత్తశుద్ధితో అమలు చేసిన ఘనత జగన్మోహన్ రెడ్డికే దక్కుతుందన్నారు. అనంతరం డ్వాక్రా మహిళలకు పసుపు కుంకుమ వ్యవహరించి మొత్తం చీరలు అందజేశారు. టిడిపి నాయకులు మాయమాటలు నమ్మి మోసపోవద్దని రంగనాథరాజు హితవు పలికారు. కార్యక్రమంలో ఎఎంసి ఛైర్మన్ చిల్లే లావణ్య, పెనుమంచిలి జెడ్‌పిటిసి కర్రి గౌరీ సుభాషిని, సర్పంచుల ఛాంబర్ మండల అధ్యక్షులు సుంకర సీతారామ్ పాల్గొన్నారు.

భవన నిర్మాణ కార్మికుని కుటుంబానికి సాయం

ప్రజాశక్తి - ఆచంట

భవన నిర్మాణ కార్మికుడు జుర్రు దేవదాస్ (54) ఇటీవల గుండెపోటుతో మృతి చెందారు. ఈ సందర్భంగా గురువారం భవన నిర్మాణ కార్మిక సంఘం ఆధ్వర్యంలో గురువారం అతని కుటుంబాన్ని పరామర్శించి రూ.5 వేల నగదు అందజేశారు. ఈ కార్యక్రమంలో సంఘం మండల అధ్యక్షులు పులపు ఏసులు, ఉపాధ్యక్షులు బొంతు శ్రీనివాస్, కార్మికులు వర్ధినీడి అంజిబాబు, ప్రసాద్, శివ పాల్గొన్నారు.

పొన్నపల్లిలో ముగ్గుల పోటీలు

ప్రజాశక్తి - నరసాపురం

ముగ్గుల పోటీలు సంస్కృతీ, సంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తాయని మహిళ కమిషన్ రాష్ట్ర మాజీ సభ్యురాలు, కాపు వనితా క్లబ్ ఛైర్‌పర్సన్ రాజ్యలక్ష్మి అన్నారు. గురువారం నరసాపురం నాలుగో వార్డులో పొన్నపల్లి గంటమ్మ ఉత్సవాల సందర్భంగా ఉత్సవ కమిటీ, కాపు వనితా క్లబ్ ఆధ్వర్యంలో బొమ్మిడి కృష్ణంరాజు ఎడ్యుకేషనల్ సొసైటీ ఛైర్మన్ బొమ్మిడి శ్రీనివాస్ ఆర్థికసాయంతో ఏర్పాటు చేసిన ముగ్గుల పోటీలకు రాజ్యలక్ష్మి ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడారు. శ్రీనివాస్ సేవా భావం కలిగిన వ్యక్తి అన్నారు. బొమ్మిడి శ్రీనివాస్ పొన్నపల్లిలో ముగ్గుల పోటీలు నిర్వహించి రూ.15 వేల విలువ చేసే బహుమతులు విజేతలకు అందించడం అభినందనీయమన్నారు. గురు సహస్ర అవధాని కడిమిళ్ల వర ప్రసాద్, రామాలయ ధర్మకర్త తమ్మా లీలా ప్రసాద్, గంథమ్మ ఆలయ ధర్మకర్త బొద్దు కృష్ణ భగవాన్ మాట్లాడారు. కార్యక్రమంలో కౌన్సిలర్ మల్లాడి శేషవేణి, రామాలయ తమ్మా ప్రసాద్, మాజీ కౌన్సిలర్ తిరుమాని శశిదేవి పాల్గొన్నారు.

ఎంపిడిఒ వెంకటేశ్వరరావుకు సత్కారం

ప్రజాశక్తి - పాలకొల్లు

పాలకొల్లు ఎంపిడిఒ సంగాని వెంకటేశ్వరరావు బదిలీపై తూర్పుగోదావరి జిల్లా వెళుతున్న సందర్భంగా ఆత్మీయ సత్కార సభ గురువారం నిర్వహించారు. మండల కార్యాలయంలో ఇఒపిఆర్‌డి వైభవతి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ శాఖల అధికారులు, ఉద్యోగులు సంగాని చేసిన సేవలను కొనియాడారు. అనంతరం సంగాని మాట్లాడుతూ విధి నిర్వహణలో ప్రజలకు, ప్రజాప్రతినిధులకు, పైఅధికారులకు, ఉద్యోగులకు వారధిగా ఉంటూ ముందుకెళ్లడమే తన బాధ్యత అని తెలిపారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ పెద్దిరాజు, ఎంఇఒలు వీరాస్వామి, ఆర్‌ఐపిఎ.గంగాధరరావు, రిటైర్డ్ ఎంపిడిఒ రాజేంద్రప్రసాద్, ఎఇ పిఆర్ శామ్యూల్ పాల్గొన్నారు.

ఆర్యవైశ్య సంఘం జిల్లా ఉపాధ్యక్షులుగా బ్రహ్మానందం

ప్రజాశక్తి - ఉండి

ఆర్యవైశ్య సంఘం ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా ఉపాధ్యక్షునిగా తాను ఈ నెల నాలుగో తేదీన ఏలూరులో జరిగే ఆర్యవైశ్య సంఘం జిల్లా సమావేశంలో ప్రమాణస్వీకారం చేయనున్నానని కగ్గల్ల బ్రహ్మానందం తెలిపారు. గురువారం విలేకరుల సమావేశంలో బ్రహ్మానందం మాట్లాడుతూ ఆర్యవైశ్యుల సమస్యలను జిల్లా సంఘం దృష్టికి తీసుకెళ్లి వాటి పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. తనపై నమ్మకం ఉంచి ఉపాధ్యక్ష పదవి వచ్చేందుకు కృషి చేసిన ఆర్యవైశ్య సంఘం మహాసభ రాష్ట్ర అధ్యక్షులు చిన్ని రామ సత్యనారాయణ, సంఘం జిల్లా మాజీ అధ్యక్షులు బొండాడ రామ్మోహన్ రావు (రాంపండు)కు కృతజ్ఞతలు తెలిపారు. సంఘం మండల అధ్యక్షులు బొండాడ కేశవరావు, గ్రామ అధ్యక్షులు మండ వెంకయ్య మాట్లాడారు. బ్రహ్మానందం గతంలో పంచాయతీ వార్డు సభ్యులుగా ఎన్నో అభివృద్ధి పనులు చేయించడంతోపాటు జిల్లా ఉపాధ్యక్షునిగా నియామకమైన బ్రహ్మానందంకు సంఘం సభ్యులు శుభాకాంక్షలు తెలిపారు.

ఇచ్చిన హామీలను అమలు చేయాలి

ప్రజాశక్తి - మొగల్తూరు

సమ్మె కాలంలో అంగన్వాడీలకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు తెలగాసెట్టి సత్యనారాయణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మొగల్తూరులోని సిపిఎం కార్యాలయంలో గురువారం సాయంత్రం అంగన్వాడీలతో నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే జిఒ విడుదల చేయాలన్నారు. సమ్మె సమయంలో సంఘీభావం తెలిపిన రాజకీయ పార్టీ నాయకులకు ఇతర సంఘాల నేతలకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా అంగన్వాడీ సమైక్యతను చాటారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యులు కవురు పెద్దిరాజు, నాయకులు ఉయ్య చిట్టిబాబు, అంగన్వాడీ నేతలు జి పెద్దింట్లు, సారమ్మ, సీతామహాలక్ష్మి, డి.నాగలక్ష్మి ఎం.ప్రియదర్శిని పాల్గొన్నారు.

పెదఅమిరంలో ఎన్‌ఎస్‌ఎస్ క్యాంప్

ప్రజాశక్తి - కాళ్ల

ఎన్‌ఎస్‌ఎస్ ద్వారా విద్యార్థులు పల్లెల్లో పర్యటించి గ్రామీణ ప్రజల సమస్యలు తెలుసుకునేందుకు ఎంతో ఉపయోగపడుతుందని భీమవరం ఎస్‌ఆర్‌కెఆర్ ఇంజినీరింగ్ కళాశాల డైరెక్టర్ ఎం.జగపతిరాజు అన్నారు. పెదఅమిరంలో జాతీయ సేవా శిబిరాన్ని ఎస్‌ఆర్‌కెఆర్ ఇంజినీరింగ్ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ విభాగం ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థులు గ్రామస్తులకు పల్లె ప్రగతికి ఏవిధంగా తోడ్పడాలో సూచనలు, సలహాలు అందించాలన్నారు. పల్లెల్లో శానిటేషన్, తాగునీరు, పర్యావరణ పరిశుభ్రత వంటి సమస్యలపై ఇంటింటికీ వెళ్లి వారిని చైతన్యం చేయాలని కోరారు. తమ కళాశాల ఉన్నత భారత అభియాన్ ద్వారా కూడా ఇటువంటి కార్యక్రమాలు నిర్వహించడం వల్ల తమ కళాశాలకు జాతీయ స్థాయిలో మంచి గుర్తింపు లభిస్తోందన్నారు. పెదఅమిరం గ్రామ పంచాయతీ సర్పంచి డొక్కు సోమేశ్వరరావు మాట్లాడుతూ ఎస్‌ఆర్‌కెఆర్ ఇంజినీరింగ్ కళాశాల తమ గ్రామాన్ని దత్తత తీసుకొని సాంకేతిక సూచనలు సలహాలు అందించడం తమకెంతో ఉపయోగకరంగా ఉందన్నారు. ఎన్‌ఎస్‌ఎస్ కోఆర్డినేటర్ ఆర్.కృష్ణచైతన్య మాట్లాడుతూ తమ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ విభాగం క్యాంపు ఏర్పాటు చేసుకునేందుకు పెదఅమిరం గ్రామ పంచాయతీ తమకు పూర్తి సహాయ సహకారాలు అందించడం పట్ల ఆయన కృతజ్ఞతలు చెప్పారు. ఆరు రోజుల పాటు జరిగే ఈ క్యాంపులో ప్రధానంగా చెట్లు నాటడం, పర్యావరణం, వైద్య శిబిరాలు కూడా ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో పెదఅమిరం గ్రామ పంచాయతీ కార్యదర్శి సునీల్‌రాజు, ఎస్‌ఆర్‌కెఆర్ ఇంజినీరింగ్ కళాశాల యుబిఎ కోఆర్డినేటర్ జి.మెహెర్ గణేష్, సహాయ ఎన్‌ఎస్‌ఎస్ కోఆర్డినేటర్ కెవిఎన్.సత్యనారాయణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా పెదఅమిరం సర్పంచి డి.సోమేశ్వరరావును కళాశాల డైరెక్టర్ ఎం.జగపతిరాజు ఘనంగా సత్కరించారు.



సర్పంచి సోమేశ్వరరావును సత్కరిస్తున్న సిబ్బంది

ఓరియంటల్ డిఎం శ్రీవెంకట శేషుబాబు ఉద్యోగ విరమణ

ప్రజాశక్తి - తణుకు రూరల్

కేంద్ర ప్రభుత్వ సాధారణ బీమా కంపెనీ స్థానిక ఓరియంటల్ ఇన్సూరెన్స్ డివిజనల్ కార్యాలయంలో 39 సంవత్సరాల పాటు సుదీర్ఘకాలం విజయవతంగా సేవలందించిన ఆకుల శ్రీవెంకట శేషుబాబు ఉద్యోగ విరమణ చేశారని ఇన్‌ఛార్జి డివిజనల్ మేనేజర్ షేక్ రహుల్లా గురువారం తెలిపారు. శ్రీ వెంకట శేషుబాబు 1985లో తణుకు ఓరియంటల్ కార్యాలయంలో ఉద్యోగపర్వాన్ని ప్రారంభించి అంచెలంచెలుగా ఎదిగారని, తిరిగి అదే కార్యాలయంలో డివిజనల్ మేనేజరుగా పనిచేస్తూ బుధవారం ఉద్యోగ విరమణ చేయడం విశేషమని తెలిపారు. ఆయన సర్వీసు కాలంలో తణుకు, తాడేపల్లిగూడెం, భీమవరం, పాలకొల్లు, రాజోలులలో కంపెనీ బ్రాంచి కార్యాలయాలను పర్యవేక్షిస్తూ ప్రజలకు ఇన్సూరెన్సు సేవలందించారని తెలిపారు. ఈ సందర్భంగా స్థానిక ఓరియంటల్ కార్యాలయంలో జరిగిన వీడ్కోలు సన్మాన సభలో ఉద్యోగులు, రిటైర్డ్ ఉద్యోగులు, ఏజెంట్లు, సర్వేయర్లు పాల్గొని శేషుబాబు సేవానిరతిని కొనియాడి సన్మానించారు. ఈ సందర్భంగా శ్రీవెంకట శేషుబాబు మాట్లాడుతూ తన సర్వీసులో సహకరించిన సహోద్యోగులు, ఏజెంట్లు, సర్వేయర్లు, కస్టమర్లు అందరికీ ధన్యవాదాలు తెలిపారు.



శ్రీవెంకట శేషుబాబు దంపతులను సత్కరిస్తున్న సభ్యులు


లింకు రోడ్డును పరిశీలిస్తున్న ఎంఎల్‌ఎ శ్రీరంగనాథరాజు

కౌరుపాలెం, పెనుమంచిలి రోడ్డుకు మోక్షం

త్వరలో నిర్మిస్తాం : ఎంఎల్‌ఎ శ్రీరంగనాథరాజు

ప్రజాశక్తి - ఆచంట

జిల్లా పరిషత్ నిధులతో కౌరుపాలెం వయా పెనుమంచిలి లింకు రోడ్డును త్వరలో నిర్మించనున్నామని ఎంఎల్‌ఎ చెరుకువాడ శ్రీరంగనాథరాజు తెలిపారు. ఆచంట పంచాయతీ పరిధి కౌరుపాలెం నుంచి వయా పెనుమంచిలి ఇసుకగుంట వెళ్లే రహదారికి ఎట్టకేలకు మోక్షం కలిగింది. ఈ రోడ్డు దశాబ్ద కాలంగా అధ్వాన స్థితి చేరుకోవడంతో ఆయా గ్రామస్తులు ఎంఎల్‌ఎకు కలిశారు. స్పందించిన ఎంఎల్‌ఎ గురువారం సాయంత్రం రహదారిని పరిశీలించారు. తక్షణం లింక్ రోడ్డు పనులు ప్రారంభించాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఆయన వెంట సర్పంచి కోట సరోజినీ వెంకటేశ్వరరావు, వైసిపి నాయకులు, పిచ్చెట్టి సత్యనారాయణ, కిరణ్, వెంకటేశ్వరరావు, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

కవిటంలో దంత వైద్య శిబిరం

ప్రజాశక్తి - పోడూరు

ప్రతి ఒక్కరూ దంతాలు ఆరోగ్యంగా ఉండేలాగా జాగ్రత్తలు తీసుకోవాలని వైఎస్‌ఆర్ క్రిస్టియన్ మైనార్టీ సెల్ జిల్లా కార్యదర్శి జి.పాల్ సుధీర్ అన్నారు. కవిటం ఆంటియోక్ చర్చిలో గురువారం విష్ణు ఎడ్యుకేషనల్ సొసైటీ ఆధ్వర్యంలో ఉచిత దంత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని పాల్ సధీర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దంత సమస్య వచ్చినప్పుడు వెంటనే దంత వైద్యులను సంప్రదించి చికిత్స తీసుకోవాలని సూచించారు. విష్ణు ఎడ్యుకేషనల్ సొసైటీ ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో ఉచిత దంత వైద్య శిబిరం నిర్వహించడం అభినందనీయమన్నారు. 80 మంది రోగులకు విష్ణు దంత వైద్యశాల వైద్యులు పరీక్షలు నిర్వహించి చికిత్స చేశారు. ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో చర్చి పాస్టర్ జివి.సుబ్బారావు, కెఎస్.చైతన్య రామ్, కెవి.శేఖర్, ఎం.శ్రీనివాస్ పాల్గొన్నారు.

విశాల సొసైటీ చైర్మన్ మరళీకి పితృవియోగం

ప్రజాశక్తి - ఆకివీడు

ఆకివీడు విశాల సహకార పరపతి సంఘం (రూరల్ బ్యాంక్) కమిటీ ఛైర్మన్ కేశిరెడ్డి మురళీ తండ్రి కేశవరెడ్డి కృష్ణమూర్తి (88) గురువారం సాయంత్రం మృతి చెందారు. ఆయన కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. మురళీకి సుమారు 25 సంవత్సరాల రాజకీయ చరిత్ర ఉంది. కాంగ్రెస్ పార్టీ సాధారణ కార్యకర్త స్థాయి నుంచి పట్టణ, మండల అధ్యక్ష స్థాయికి ఎదిగాడు. రెండు సంవత్సరాలుగా రూరల్ బ్యాంకు పాలకవర్గ కమిటీ ఛైర్మన్‌గా పనిచేస్తున్నారు. కృష్ణమూర్తి మృతి పట్ల డిసిసిబి ఛైర్మన్ పివిఎల్ నరసింహరాజు, నగర పంచాయతీ ఛైర్‌పర్సన్ జామి శ్రీనివాసు హైమావతి, మండల పరిషత్ అధ్యక్షులు కటారి జయలక్ష్మి కేశవరావు, నేతలు సంతాపం తెలిపారు.

కోనా సేవలు అభినందనీయం

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

డైమండ్స్ క్లబ్ సర్వీస్ ఛైర్‌పర్సన్ కోనా సేవలు అభినందనీయమని లయన్స్ జోన్ ఛైర్మన్ పేరిచర్ల మురళీ కృష్ణరాజు తెలిపారు. ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ నాయకులు లయన్ కోనా శ్రీనివాస్‌కు లయన్స్ జోన్ ఛైర్మన్ లయన్ పేరిచర్ల మురళీ కృష్ణంరాజు, డైమండ్స్ క్లబ్ ప్రసిడెంట్ లయన్ కొప్పిశెట్టి రమణయ్య పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. కోనా శ్రీనివాస్ పుట్టినరోజు సందర్భంగా గురువారం కోనా కుటుంబసభ్యులు పలు సేవా కార్యక్రమాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా మురళీ కృష్ణంరాజు మాట్లాడుతూ కోనా సేవలు అభినందనీయమన్నారు. కార్యక్రమంలో క్లబ్ ఫాస్ట్ ప్రెసిడెంట్ ఛైర్మన్ లయన్ కోనా హనుమాన్ సాయిరాం, లియో గణేష్‌వర్మ, భువన్ పాల్గొన్నారు.

పోరాటాలతోనే హక్కుల సాధన

ప్రజాశక్తి - ఆకివీడు

భారత కార్మిక ఉద్యమానికి నెల్లిమర్ల కార్మిక ఉద్యమం ఆదర్శనీయమని, పోరాటాలతోనే హక్కులు సాధించగలమని ఐఎఫ్‌టియు జిల్లా ఉపాధ్యక్షులు ఎస్.రామ్మోహన్ అన్నారు. ఐఎఫ్‌టియు కేంద్ర కమిటీ పిలుపులో భాగంగా దుంపగడపలో నెల్లిమర్ల అమరవీరుల 30వ వర్థంతి సభ ఐఎఫ్‌టియు మండల కార్యదర్శి తోట రామకృష్ణ అధ్యక్షతన గురువారం జరిగింది. ఈ సభలో రామ్మోహన్ మాట్లాడుతూ దేశవ్యాప్తంగా భవననిర్మాణ కార్మికులు దోపిడీకి, వివక్షతకు గురవుతున్నారన్నారు. దేశంలో కార్మిక వర్గం చట్టాల, హక్కుల పరిరక్షణ కోసం ఉద్యమించాల్సిన పరిస్థితి నేడు ఏర్పడిదన్నారు. కార్మికుల బలమైన పోరాటాల ద్వారా మాత్రమే హక్కులను సాధించుకోగలుగుతామన్నారు. అనంతరం స్థానిక భవన నిర్మాణ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాయకులు తోట రామకృష్ణ, వెంకన్న, శ్రీనివాస్, వంశీ, శేషగిరిరావు పాల్గొన్నారు.

ఎన్నికల కోడ్ వచ్చే వరకు ఓటర్ల సవరణ

జిల్లా కలెక్టర్ ప్రశాంతి

ప్రజాశక్తి - భీమవరం

ఓటర్ల సవరణ కార్యక్రమంలో భాగంగా ఎన్నికల కోడ్ వచ్చే వరకు చేర్పులకు, తొలగింపులకు అవకాశం ఉటుందని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి తెలిపారు. గురువారం రాత్రి స్థానిక కలెక్టరేట్‌లో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఆమె సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నామినేషన్లు పూర్తి అయ్యే వరకు ఓటర్ల నమోదు కార్యక్రమం ఉంటుందన్నారు. ఓటర్ల జాబితా తుది ప్రచురణ అనంతరం కొన్ని పెండింగ్ అంశాలు ఉన్నాయని, ఫొటోలు సక్రమంగా లేనివి, డూప్లికేట్స్, తప్పుగా పేర్లు నమోదైనవి, పెండింగ్ ఉన్న డెత్ కేసులు, తప్పు డోర్ నెంబర్లు గలవి, జంక్ డోర్ నెంబర్లు, ఒకే ఇంట్లో 10 మంది కంటే ఎక్కువ ఓటర్లు ఉన్నవి, ఒకే కుటుబం నుండి వేర్వేరు పోలింగ్ స్టేషన్లలో ఓటు కలిగిన వారివి తిరిగి పరిశీలిస్తున్నామన్నారు. సమావేశంలో ఇన్‌ఛార్జి డిఆర్‌ఒ బి.శివన్నారాయణరెడ్డి, ఎలక్షన్ సెల్ సూపరింటెండెంట్ వై.దుర్గా కిషోర్, డిప్యూటీ తహశీల్దార్ ఎం.సన్యాసిరావు, వివిధ రాజకీయపక్షాల ప్రతినిధులు కామన నాగేశ్వరరావు, మరపట్ల శ్యాంబాబు, కాటూరి కరుణాకర్, పాల్గొన్నారు.

ఆర్‌టిసి డ్రైవర్లకు సత్కారం

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

సురక్షితంగా గమ్యస్థానాలకు చేరతామనే భరోసాను ఆర్‌టిసి ప్రయాణికులకు కల్పిస్తోందని తాడేపల్లిగూడెం డిపో మేనేజర్ వై.సత్యనారాయణ మూర్తి తెలిపారు. జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాల్లో భాగంగా స్థానిక ఆదికవి నన్నయ్య విశ్వవిద్యాలయంలో గురువారం డ్రైవర్స్ డే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నన్నయ యూనివర్సిటీ ప్రిన్సిపల్ టి.అశోక్ మాట్లాడుతూ సురక్షితంగా విద్యార్థులను ప్రతిరోజూ యూనివర్సిటీకి తీసుకొస్తున్న ఆర్‌టిసి డ్రైవర్లను అభినందించారు. ఆర్‌టిసి ఆ సంస్థకు రథచక్రాలని కొనియాడారు. ఈ సందర్భంగా డ్రైవర్లు జి.రాజాబాబు, ఎస్‌జె.హుస్సేన్, జి.వినయ్ కుమార్, ఎస్.వీరన్న, వైవిఎస్ గణేష్, పి.శ్రీనివాస్‌ను యూనివర్సిటీ సత్కరించింది. యూనివర్సిటీ విద్యార్థులు చాలా క్రమశిక్షణ కలిగిన వారన్నారు. కార్యక్రమంలో ఆర్‌టిసి డిపో సెక్రటరీ ఎ.రవికుమార్, ఎంఎస్.బాబు, యూనివర్సిటీ అధ్యాపక అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

జనసేన నియోజకవర్గ ప్రతినిధిగా సత్యన్

ప్రజాశక్తి - నరసాపురం

జనసేన నరసాపురం నియోజకవర్గ అధికార ప్రతినిధిగా దివి వీర వెంకట సత్యనారాయణ (సత్యన్)ను నియమించినట్లు పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి బొమ్మిడి నాయకర్ తెలిపారు. గురువారం నాయకర్‌ను సత్యన్ పార్టీ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సత్యన్‌కు నాయకర్ శుభాకాంక్షలు తెలిపారు.

సమన్వయంతో ముందుకెళ్తాం : పివిఎల్

ప్రజాశక్తి - కాళ్ల

సిఎం జగన్మోహన్ రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిని చేసేందుకు నాయకులు, కార్యకర్తలంతా సమన్వయంతో ముందుకెళ్దామని డిసిసిబి ఛైర్మన్ వి వి ఎల్. న ర సిం హా రా జు పిలుపునిచ్చారు. పెదఅమిరం గ్రామ పరిధిలో సచివాలయం - 2లో గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా వైసిపి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను వారికి వివరించి, కరపత్రాలను పంపిణీ చేశారు. నియోజకవర్గాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేస్తామన్నారు. అవినీతి రహిత పాలన అందిస్తున్న ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికి అందరూ బాసటగా నిలవాలన్నారు. కార్యక్రమంలో సర్పంచి డొక్కు సోమేశ్వరరావు, ఎంపిపి పెన్మెత్స శిరీష విశ్వనాథరాజు, జెడ్‌పిటిసి పచ్చిగోళ్ల సోమేశ్వరరావు, సర్పంచుల ఛాంబర్ జిల్లా అధ్యక్షులు కొలుకులూరి ధర్మరాజు, కోపల్లె, కలవపూడి సొసైటీ అధ్యక్షులు వేగేశ్న జయ రామకృష్ణంరాజు, పి.దుర్గా ప్రసాదరాజు పాల్గొన్నారు.


పథకాల బ్రోచర్‌ను అందజేస్తున్న పివిఎల్

వెల్డింగ్ ఇండస్ట్రీకి స్థలం కేటాయింపు

ప్రజాశక్తి - ఆచంట

దుర్గాదేవి వెల్డింగ్ వర్కర్స్ అసోసియేషన్ కార్మికులకు వెల్డింగ్ ఇండస్ట్రీ వర్క్‌షాప్‌నకు పంచాయతీ ల్యాండ్ నుంచి 25 సెంట్ల స్థలాన్ని కేటాయించినట్లు ఎంఎల్‌ఎ చెరుకువాడ శ్రీరంగనాథరాజు తెలిపారు. ఇండస్ట్రీ స్థలం కోసం వెల్డింగ్ కార్మికులు ఎంఎల్‌ఎను కలవగా ఆయన స్పందించి 25 సెంట్లు కేటాయించి రిజిస్ట్రేషన్ చేసి ఇస్తామని తెలిపారు. అనంతరం ఆ స్థలాన్ని గురువారం సాయంత్రం ఎంఎల్‌ఎ పరిశీలించారు. ఈ సందర్భంగా దుర్గాదేవి వెల్డింగ్ వర్కర్స్ సభ్యులు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సర్పంచి కోట సరోజినీ వెంకటేశ్వరరావు, పట్టణ అధ్యక్షులు పిచ్చెట్టి సత్యనారాయణ, నాయకులు పాల్గొన్నారు.

టిడిపితోనే అభివృద్ధి : పితాని

ప్రజాశక్తి - పెనుగొండ

పెనుగొండలో ప్రజల వద్దకు పితాని కార్యక్రమంలో భాగంగా మాజీ మంత్రి పితాని సత్యనారాయణ ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. గురువారం పెనుగొండ పంచాయతీ జలంచెరువు, మారమ్మగూడెం, దొంగగూడెం, రామచంద్ర పేట కాలనీలో ఈ కార్యక్రమం నిర్వహించి మాట్లాడారు. టిడిపితోనే అభివృద్ధి సాధ్యమని తెలిపారు. ఎన్నికల్లో తమకు ఓటేసి ఆశీర్వదించాలన్నారు. పాదయాత్రలో మాజీ ఎంఎల్‌సి మల్లు లక్ష్మీనారాయణ, ఆచంట జెడ్‌పిటిసి సురేష్ బాబు, టిడిపి, జనసేన కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యారంగంపై అబద్ధాల బడ్జెట్ : ఎస్‌ఎఫ్‌ఐ

ప్రజాశక్తి - భీమవరం

కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్లో విద్యా రంగంపై పెట్టిన బడ్జెట్ అబద్ధాల బడ్జెట్‌గా ఉందని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు కె.ఈశ్వర్, టి.ప్రసాద్ విమర్శించారు. ఈ మేరకు వారు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఆర్థిక శాఖ మంత్రి నిర్మల సీతారామన్ వాస్తవాలకు బహు దూరంగా బడ్జెట్ సమావేశాల్లో మాట్లాడారని పేర్కొన్నారు. ఉన్నత విద్యారంగంలో 28 శాతం విద్యార్థినుల ఎన్‌రోల్ మెంట్ పెరిగిందనడం, సైన్స్, టెక్నాలజీ ఇంజనీరింగ్, మెడికల్ విభాగాల్లో విద్యార్థినుల చేరిక 43 శాతంగా ఉందని ప్రపంచంలోనే ఇది అత్యుత్తమమైనది అనడం హాస్యాస్పదంగా ఉందని తెలిపారు. బిజెపి అధికారం చేపట్టాక విద్యార్థులు చదువులకు దూరమయ్యారని, కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న కేంద్రీయ విశ్వవిద్యాలయాల్లో, కేంద్రీయ పాఠశాలల్లో, నవోదయల్లో కనీస మౌలిక సదుపాయాలు లేవని తెలిపారు. నూతన ఐటిఐ లు, ఐఐటీలు, మెడికల్ కళాశాలలు, ఐఐఎం లు ఏర్పాటు చేసినట్లు గొప్పలు చెప్పారని, కానీ ఆయా కళాశాలలో మౌలిక సదుపాయాల కొరత విద్యార్థులను తీవ్రంగా వేధిస్తోందని తెలిపారు. దేశంలో విద్యాప్రమాణాలు పెరగాలంటే బడ్జెట్ కేటాయింపులు పెంచాలని డిమాండ్ చేశారు.

సోమేశ్వరరావుకు పురంధేశ్వరి పరామర్శ

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన బిజెపి జిల్లా ఉపాధ్యక్షులు నరిశే సోమేశ్వరరావు తండ్రి నరిశే వీర్రాజు కుటుంబ సభ్యులను రాష్ట్ర బిజెపి అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి గురువారం వారి గృహంలో పరామర్శించారు. ఆమె వెంట బిజెపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాశీ విశ్వనాథ రాజు, బిజెపి రాష్ట్ర కార్యదర్శి భూపతి రాజు శ్రీనివాసవర్మ బిజెపి జిల్లా అధ్యక్షులు నార్ని తాతాజీ ఉన్నారు.

విద్యార్థులకు ఐరన్ మాత్రల పంపిణీ

గణపవరం: రక్తహీనత నివారణకు ఐరన్ మాత్రలు వాడాలని కాశిపాడు ఆరోగ్య సహాయకులు నామాల రాజు అన్నారు. గురువారం కాశిపాడు హైస్కూల్ విద్యార్థులకు రాష్ట్రీయ బాల స్వస్థ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు ఐరన్ మాత్రలు అందజేశారు. ఈ సందర్భంగా నామాల రాజు మాట్లాడుతూ రక్తహీనత లోపిస్తే అలసటగా ఉంటుందని, చర్మం పాలిపోయి నోటి పూతతో అనారోగ్యంగా ఉంటారని తెలిపారు. వీటి నివారణకు విద్యార్థులు ఐరన్ మాత్రలు వేసుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో హైస్కూల్ హెచ్‌ఎం ఎఎస్‌ఎస్ బిఆర్.ప్రసాద్, ఎఎన్‌ఎం శివకుమారి, ఆశాలు పాల్గొన్నారు.

ఆడపిల్లల సంరక్షణపై అవగాహన

వీరవాసరం: అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా ఆడపిల్లల అభ్యున్నతికి కృషి చేద్దామని ఐసిడిఎస్ సూపర్‌వైజర్ వి.కనకమహాలక్ష్మి తెలిపారు. బేటీ బచావో బేటీ పడావో కార్యక్రమంలో భాగంగా గురువారం వీరవాసరం పెదపేటలోని అంగనవాడీ కేంద్రంలో ఆడపిల్లల సంరక్షణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కిషోర్ బాలికల వ్యక్తిగత పరిశుభ్రత, ఆడపిల్లలకు విద్య, అవశ్యకత, గుడ్‌టచ్, బ్యాడ్‌టచ్, ఆహారం, ఆరోగ్యం వంటి విషయాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంపిపి స్కూల్ ప్రధానోపాధ్యాయులు ఎన్.ప్రసాద్‌బాబు, అంగన్‌వాడీ సిబ్బంది పి.నాగరత్నం, జి.గంగాభవాని, ఎన్.శాంతకుమారి, జి.మంగమ్మ పాల్గొన్నారు.

వ్యకాస ఆధ్వర్యాన విరాళాల సేకరణ

గణపవరం: అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం ఢిల్లీ కార్యాలయ నిర్మాణానికి గురువారం వ్యవసాయ కార్మిక సంఘం మండల కమిటీ ఆధ్వర్యంలో గురువారం విరాళాలు సేకరించారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజలు తమ ఇంటిలోని నగదుతో పాటు టివిలు, ఫ్యాన్లు, సైకిళ్లు, మిక్సీలతోపాటు బియ్యం విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా కమిటీ కార్యదర్శి జక్కంశెట్టి సత్యనారాయణ మాట్లాడారు. సంఘం కార్యకర్తలు అడిగిన వెంటనే స్థానికులు విరాళాలు ఇవ్వడం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సంఘం మండల అధ్యక్ష కార్యదర్శులు ఎస్.సంజీవరావు, ఎన్.రామకృష్ణ, కౌలు రైతు సంఘం జిల్లా నాయకులు పి.నరసింహమూర్తి, మామిడి చెట్టు వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.